కాంగ్రెస్‌లో కలహాల కాపురం

- వీధిన పడుతున్న వర్గపోరు
- ఇందిరమ్మ కమిటీలతో ఊరూరా కుమ్ములాటలు
- ఖమ్మం, వరంగల్, పాలమూరు ఆదిలాబాద్ సహా అంతటా అదేతీరు
- కొండా దంపతులపై గుర్రు
- గడ్డం, ప్రేమ్‌సాగర్‌రావు మధ్య వైరం
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో దానం వర్సెస్ విజయారెడ్డి

గ్రామాల్లో వేసిన ఇందిరమ్మ కమిటీల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీనియర్లను విస్మరించి, కొత్త వారికే చోటు కల్పించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు జనగామ జిల్లా జఫర్‌గడ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రం ఇచ్చి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ జడ్పీటీసీ పట్టపూరి సదయ్యగౌడ్ మాట్లాడుతూ ఏండ్ల తరబడి జెండాలు మోసిన పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, నిన్నా మొన్న కాంగ్రెస్‌లో చేరిన వారికి నామినేటెడ్ పోస్టులు, ఇందిరమ్మ కమిటీల్లో అవకాశం ఇచ్చి అసలైన కాంగ్రెస్‌వాదులను పక్కన పెడుతున్నాడని ఆరోపించారు. - జఫర్‌గఢ్

హైదరాబాద్, అక్టోబర్17(నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితి రోజురోజుకు 'హస్త'వ్యస్థంగా మారుతున్నది. వివిధ జిల్లాల్లో వర్గపోరు వీధినపడుతున్నది. ఇందిరమ్మ కమిటీల నేపథ్యంలో వరంగల్, అదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గ్రూపు తగాదాలు రచ్చకెక్కాయి. మిగిలిన జిల్లాల్లోనూ కీలక నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తున్నది. ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లాలో ఎవరి కుంపటి వారిదే అన్నట్టుగా పరిస్థితి తయారైంది. అదుపు తప్పి పోతున్న నేతలను, కార్యకర్తలను ఎలా గాడిలో పెట్టాలో అర్థంకాక పార్టీ పెద్దలు తలలుపట్టుకున్నారు.

వనపర్తిలో పచ్చగడ్డి వేస్తే..

మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డికి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. వనపర్తి టికెట్ కేటాయింపు సమయంలోనే ఇద్దరి మధ్య విబేధాలు వచ్చాయి. మొదట చిన్నారెడ్డిని వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించి, చివరి నిమిషంలో మేఘారెడ్డికి టికెట్ ఇచ్చారు. అయినా చిన్నారెడ్డి ప్రయత్న లోపం లేకుండా మేఘారెడ్డి గెలుపు కోసం పని చేశారు. పార్టీ అధికారంలోకి రాగానే చిన్నారెడ్డికి క్యాబినెట్ హోదా కల్పిస్తూ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షునిగా నియమించింది. అప్పటినుంచి ఇద్దరి మధ్య వర్గపోరు తీవ్రమైంది. వేర్వేరు సమీక్షలు నిర్వహించడం, పార్టీలో నూతనంగా చేర్చుకోవడం లాంటి పరిణామాలు ఇద్దరి మధ్య అగ్గి రాజేశాయి. తనకు తెలియకుండానే మేఘారెడ్డి పార్టీలోకి కొత్తవారిని తీసుకుంటున్నారని చిన్నారెడ్డి సీఎంకు ఫిర్యాదు చేశారు. పదేండ్లపాటు తమపై కేసులు పెట్టి వేధించిన వారిని పార్టీలోకి చేర్చుకోవద్దని ఎమ్మెల్యే మేఘారెడ్డికి చిన్నారెడ్డి సూచించారు. అయినా చేరికలు ఆపకపోవడంతో చిన్నారెడ్డి వర్గానికి చెందిన గోపాల్‌పేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నం చేశారు. మిగిలిన వారు అడ్డుకుంటున్న క్రమంలో మేఘారెడ్డిపై కూడా పెట్రోల్ పడింది. దీంతో అక్కడే ఉన్న మిగిలిన కార్యకర్తలు, గన్‌మెన్‌లు గణేశ్‌గౌడ్‌పై దాడి చేశారు. అప్పటినుంచి ఇద్దరు నేతలు రెండు వర్గాలుగా రాజకీయం చేస్తున్నారు.

గద్వాలలో సరిత వర్సెస్ బండ్ల

గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయి సరితా యాదవ్‌కు, ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఏమాత్రం పడటం లేదు. తనను ఓడించిన వ్యక్తిని పార్టీలోకి ఎలా తీసుకుంటారంటూ పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని సరితాయాదవ్ గట్టిగానే నిలదీశారు. ఆమెను బుజ్జగించిన రాష్ట్ర పార్టీ, త్వరలోనే కార్పోరేషన్ పదవి ఇస్తాననే హామీ ఇచ్చింది. నేటికీ ఆమెకు ఏ పదవి ఇవ్వలేదు. తనకు పదవి రాకుండా కృష్ణమోహన్‌రెడ్డి అడ్డుపడుతున్నాడని సరితాయాదవ్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కృష్ణమోహన్‌రెడ్డి ఎక్కడ మీటింగ్ పెట్టినా, ఆమె వర్గీయులు తీవ్రంగా విభేదిస్తూ ఆందోళనకు దిగుతున్నారు.

వరంగల్‌లో లొల్లిలొల్లి

వరుస వివాదాలతో వరంగల్ జిల్లా పతాక స్థాయిలో ఉన్నది. వరంగల్‌లో నడిచేది కొండా ప్రభుత్వమే అని బహిరంగ ప్రకటన చేసిన మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి.. జిల్లా పై ఆధిపత్యం కోసం అన్నంత పని చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో తమకంటూ ఒక గ్రూప్‌ను తయారు చేసుకొని, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తుండటంతో జిల్లా ఎమ్మెల్యేలు ఆగ్రహంతో ఉన్నారు. పరకాల నియోజకవర్గం మీద తమ పట్టు నిలుపుకోవాలని కొండా దంపతులు భావిస్తున్నారు. ఇందిరమ్మ కమిటీలతో తన వర్గానికే మేజర్ వాటా పదవులు వచ్చే విధంగా పావులు కదుపుతున్నారు. మంత్రి హోదాలో పరకాల నియోజకవర్గంలో తరుచుగా సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీనిని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తన నియోజకవర్గంలో వారి పెత్తనం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల రేవూరికి, కొండాకు మధ్య ఫోన్లో తీవ్రస్థాయి వాగ్వాదమే జరిగింది. చివరకు ఫ్లెక్సీల గొడవలతో రెండు వర్గాలు రోడ్ల మీది కొట్టుకునే వరకు వచ్చింది. మొదటినుంచీ మంత్రులు కొండా సురేఖ, సీతక్క మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. సీతక్క పనులు సజావుగా సాగకుండా అక్కడ కూడా కొండా దంపతులు వర్గపోరు రాజేసినట్టు తెలుస్తున్నది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కొండా దంపతులకు తీవ్రస్థాయి విభేదాలే ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన మాజీ మంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యతో కొండా దంపతులకు అసలు పడటం లేదు. వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో కొండా మురళి వర్సెస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నట్టుగా రాజకీయం సాగుతున్నది. దమ్ముంటే బసవరాజు సారయ్య ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆ మధ్య కాలంలో కొండా మురళి బహిరంగ సవాల్ విసిరారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో తాను పాలకుర్తి నుంచే పోటీ చేస్తానని మురళి పదేపదే చెప్తుండటంతో అక్కడి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి గుర్రుగా ఉన్నారు.

పోచారం వర్సెస్ ఏనుగు

నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో వర్గపోరు రాజుకున్నది. ఇక్కడినుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. నిజానికి రవీందర్‌రెడ్డిది కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం. బీజేపీలో ఉన్న ఆయన ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరగా.. బాన్సువాడ టికెట్ ఇచ్చారు. అప్పటివరకు ఈ టికెట్ ఆశించిన కాంగ్రెస్ నాయకుడు బాలరాజు తీవ్ర మనస్థాపంలో ఆత్మహత్యకు ప్రయత్నించారు. తనకు వస్తుందనుకున్న టికెట్‌ను ఎగురేసుకుపోయిన ఏనుగు రవీందర్‌రెడ్డి మీద కోపం పెంచుకున్నారు. బాల్‌రాజ్‌కు టీఎస్ ఆగ్రోస్ చైర్మన్ పదవి లభించింది. తాజాగా బాలరాజు, పోచారం ఒక వర్గంగా, ఏనుగు రవీందర్‌రెడ్డి వైరివర్గంగా వర్గపోరు నడుస్తున్నది.

దానం వర్సెస్ విజయారెడ్డి

హైదరాబాద్ జిల్లా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో పీజేఆర్ కూతురు విజయారెడ్డి వర్గాల మధ్య వైరం ఏర్పడింది.

గడ్డంపై తిరుగుబాటు

ఆదిలాబాద్ జిల్లాలో గడ్డం కుటుంబంపై పార్టీ ఎమ్మెల్యేలు బహిరంగానే తిరుగుబాటు చేస్తున్నారు. జిల్లాలో గడ్డం కుటుంబం పెత్తనం తగ్గించాలని పార్టీ అధిష్ఠానానికి లేఖలు రాస్తున్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు విరుద్ధంగా ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి పార్టీ టికెట్లు ఇవ్వడమే తొలి తప్పు అని ఆ జిల్లా ద్వితీయశ్రేణి నాయకులు అంటున్నారు. మళ్లీ అదే కుటుంబానికే మంత్రి పదవి ఇస్తామనేలా అధిష్ఠానం నుంచి లీకులు వదలడాన్ని జిల్లా ఎమ్మెల్యేలు జీర్ణించుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత ప్రేమ్‌సాగర్‌రావు గడ్డం కుటుంబానికి వైరి వర్గంగా ఉన్నారు. ఆయన కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. తనను కాదని వేరొకరికి మంత్రి పదవి ఇస్తే తడాఖా చూపిస్తానని హెచ్చరిస్తున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో ఇటీవలే బీఆర్ఎస్ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. దీనిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శీహరిరావు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు రెండు గ్రూపులుగా విడిపోయాయి.

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, నేతలు వెంకటేశ్వర్లు, గొల్లపల్లి ప్రభాకర్‌గౌడ్

ఎమ్మెల్యే.. పొలిమేర దాటనివ్వం

- గ్రూపు రాజకీయాలు చేస్తే ఊరుకునేదే లేదు
- ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్లే ఉండాలి
- ఎమ్మెల్యే మురళీనాయక్‌కు సొంత పార్టీ నేతల హెచ్చరిక

నెల్లికుదురు, అక్టోబర్ 17: గ్రూపు రాజకీయాలకు తెరలేపేవారిని గ్రామ పొలిమేర దాటనివ్వమని ఎమ్మెల్యే మురళీనాయక్‌ను సొంత పార్టీ నేతలు హెచ్చరించారు. ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో సీనియర్ నేతలను విస్మరించడాన్ని నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలకేంద్రంలో గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, మాజీ జీడీపీటీసీ హెచ్ వెంకటేశ్వర్లు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్‌గౌడ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో ఎవరికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో తెలియనిస్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని విమర్శించారు. ఇండ్లలో కూర్చొని ఇందిరమ్మ కమిటీలు వేస్తే ఢిల్లీకి వెళ్లి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఆధిపత్యం కోసం ఆడబిడ్డలను అవమానిస్తారా?

ఇందిరమ్మ కమిటీలపై కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి అసంతృప్తి

నిర్మలారెడ్డి

బయ్యారం అక్టోబర్ 17: ఆధిపత్యం కోసం ఆడబిడ్డలను అవమానిస్తున్నారని కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు తగిర నిర్మలారెడ్డి ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా బయ్యారం మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన ఇందిరమ్మ కమిటీలో మహిళా సభ్యుల పేర్లను తనకు ఎలాంటి సమాచారం లేకుండా ఎంపిక చేశారని తెలిపారు. పార్టీ గెలుపు కోసం ఇంటింటికీ తిరిగి ఓట్లు ఆడిగిన తనకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. అందరి సమక్షంలో ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేయకుంటే, రానున్న రోజుల్లో పార్టీకి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ గౌడ్

కాంగ్రెస్ కార్యకర్తలతో ఇందిరమ్మ కమిటీలా?

ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌గౌడ్ మండిపాటు

ఖైరతాబాద్, అక్టోబర్ 17: రాష్ట్రప్రభుత్వం వేసిన ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ కార్యకర్తల కమిటీగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గడిల కుమార్‌గౌడ్ మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వారిని కాదని, ప్రభుత్వం ఏకపక్షంగా కమిటీలు వేయడమేంటని ప్రశ్నించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఇందిరమ్మకమిటీలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

కొండా సురేఖపై పరువు నష్టం కేసులో.. నేడు కేటీఆర్ వాంగ్మూలం నమోదు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు వాంగ్మూలాన్ని శుక్రవారం ప్రజాప్రతినిధుల కోర్టు నమోదు చేయనుంది. మేజిస్ట్రేట్ శ్రీదేవి జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ కేసులో సాక్షులుగా ఉన్న తుల ఉమ, బాల్కసుమన్, సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్‌కుమార్‌ల వాంగ్మూలాలను సైతం కోర్టు నమోదు చేయనుంది. సెక్షన్ 356 బీఎన్ఎస్ ప్రకారం కేటీఆర్ వాంగ్మూలం కీలకంగా మారనుంది. ఇటీవల గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ సినీ నటి సమంత విడాకులపై నిరాధార ఆరోపణలు చేసిన వీడియో క్లిప్పింగ్‌లు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు, పత్రికల్లో వచ్చిన వార్తలను నిక్షిప్తం చేసిన పెన్‌డ్రైవ్‌ను, ఫొటోలను సాక్ష్యాధారాలుగా కోర్టుకు సమర్పించారు.

ప్రభుత్వ దవాఖానల్లో సదుపాయాలపై నివేదిక

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో మౌలిక వసతులు, సిబ్బంది నియామకం, ఇతర సౌకర్యాలపై వివరాలను నివేదించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా ప్రభుత్వ దవాఖానల్లో కనీస సదుపాయాల కల్పనకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ కే అఖిల్, శ్రీగురుతేజ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. తదుపరి విచారణ నాటికి కన్సల్టేషన్ రూమ్స్, డయాలసిస్ యూనిట్లు, హెచ్ఎయూ, ఐసీయూ బెడ్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, మందుల పంపిణీ కౌంటర్లు, నర్సుల సంఖ్య–ఖాళీలు, సీటీ స్కాన్, ఎక్స్‌రే, టెలిఫోన్, బ్లడ్‌బ్యాంక్ తదితర వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

సీఎంవో అనుమతితోనే హెలికాప్టర్ వినియోగం

ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కార్యాలయ అనుమతితోనే తాను హెలికాప్టర్ సేవలను వినియోగించుకుంటున్నానని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టంచేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల పర్యవేక్షణ, సమయం ఆదా కోసమే హెలికాప్టర్‌ను వాడుతున్నానని గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. వరదలు, గణేశుడి నిమజ్జనం సందర్భంలోనూ హెలికాప్టర్‌ను వినియోగించానని గుర్తుచేశారు. తాను వివిధ సందర్భాల్లో ఏడుసార్లు సహచర మంత్రులతో కలిసి హెలికాప్టర్‌లో వెళ్లానని తెలిపారు. ఈ విషయంలో సీఎం కార్యాలయం ఏనాడు అనుమతి నిరాకరించలేదని స్పష్టంచేశారు.

'స్థాయీ సంఘం'లో ఎంపీ వద్దిరాజు

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గురువారం నిర్వహించిన పెట్రోలియం, సహజ వాయువు శాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశంలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఆవరణలోని కమిటీ హాల్‌లో సంఘం చైర్మన్ సునీల్ దత్తాత్రేయ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో పెట్రో ఉత్పత్తి అయిన సహజవాయువు(వంటగ్యాస్)ను వినియోగదారులకు మరింత సులువుగా అందించే విషయంపై వద్దిరాజు తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

జగిత్యాలలో బాలిక ఆత్మహత్య

ప్రేమ పేరిట బాలుడి వేధింపులు మనస్తాపంతో బలవన్మరణం

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 17: ప్రేమ వేధింపులకు ఓ బాలిక ప్రాణాలు తీసుకున్నది. తొమ్మిదో తరగతి చదువుతున్న తోటి విద్యార్థి వేధించడంతో ఆత్మహత్య చేసుకున్నది. జగిత్యాల పట్టణానికి చెందిన బాలిక (13) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నది. అదే స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు (14) తరచూ ఫోన్ చేసి ప్రేమ పేరిట వేధించడంతో మనస్తాపం చెందింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నది. ప్రేమ వేధింపులతోనే తన కూతురు ఉరేసుకుందని బాలిక తల్లి జగిత్యాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మాదిగలకు రేవంత్‌మోసం

- ఎస్సీల వర్గీకరణపై ఉద్దేశపూర్వకంగా కాలయాపన
- క్యాబినెట్‌లోని మాల పెద్దల ఒత్తిడికి లొంగిన సీఎం
- 25 నుంచి దశల వారీగా మాదిగల ధర్మయుద్ధ పోరాటం
- డిసెంబర్ 20 వరకు మహాసభలు, రథయాత్రలు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వెల్లడి

మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, అక్టోబర్ 17: 'ఆగస్టు 1న అసెంబ్లీ సాక్షిగా దేశంలోనే మొదటిసారి తానే వర్గీకరణ ప్రారంభిస్తానని చెప్పాడు. రెండు నెలలు గడుస్తున్నయి. కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నడు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను నమ్మించి మోసం చేసిండు' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఖరిని తీవ్రంగా ఖండించారు. పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. కానీ దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని, గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో కూడా వర్గీకరణను అమలు చేస్తామని, అందుకు ఆర్డినెన్స్ తీసుకువస్తామని చెప్పిన రేవంత్ మాత్రం మాట తప్పారని మండిపడ్డారు. సీఎం మాటలకు ఏమాత్రం విలువలే కుండా పోయిందన్నారు. నమ్మించడంలో.. మోసం చేయడంలో రేవంత్‌రెడ్డి ఘనుడేనని అర్థమైందని, తేనె పూసిన కత్తిలా మాట్లాడి ముంచేశాడని విమర్శించారు. రేవంత్ సర్కారు 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, అందులో వర్గీకరణ అమలు చేయకుండా మాదిగ బిడ్డల పొట్టకొట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రూప్–1, గ్రూప్–2 తోపాటు డిసెంబర్ నాటికి లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి.. వర్గీకరణ లేకుండానే వాటిని పూర్తిచేసే పనిలో ఉన్నారని పేర్కొన్నారు. ఎఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర క్యాబినెట్‌లోని మాల పెద్దల ఒత్తిడితో మంత్రివర్గ కమిటీ అని ఆ తర్వాత కమిషన్ పేర్లు చెప్పి మాదిగల పట్ల కుట్ర, వివక్షపూరిత రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. వర్గీకరణ చేయాలని మాదిగలు, వద్దని మాలలు కొట్లాడుకుంటుంటే లబ్ధిపొందాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ ఎత్తుగడ అని విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్‌పై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేసిందని, రిజర్వేషన్ ఫలాలు మాలమాదిగలకు అందకుండా చేయాలన్నది కుట్ర అని ఆరోపించారు. రేవంత్ సర్కారు చర్యలకు నిరసనగా, ఈ నెల 25 నుంచి ఉమ్మడి జిల్లాల్లో మాదిగల ధర్మయుద్ధ జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని తెలిపారు. ఆ తరువాత నవంబర్ 4 నుంచి 14 వరకు 119 నియోజకవర్గాల్లో ధర్మయుద్ధ దీక్షలు, నవంబర్ 16 నుంచి డిసెంబర్ 20 వరకు ధర్మయుద్ధ రథయాత్రలు నిర్వహిస్తామని చెప్పారు. డిసెంబర్ 21న లక్షల మందితో హైదరాబాద్‌లో మహాప్రదర్శన నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

డీజీపీ హోదా అధికారుల జాబితా సిద్ధం

- సుప్రీంకోర్టు ఆదేశాలతో సిద్ధంచేసిన హోంశాఖ

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): తాత్కాలిక డీజీపీల నియామకంపై ఇటీవల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో మిగతా ఏడు రాష్ట్రాలతోపాటు తెలంగాణ కూడా డీజీపీ హోదా ఉన్న అధికారుల వివరాలను సిద్ధం చేసినట్టు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమించిన ఎనిమిది రాష్ట్రాలకు సుప్రీంకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులను జారీచేసిన విషయం తెలిసిందే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమించాయంటూ హర్యానాకు చెందిన వినోద్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టి.. ధిక్కార నోటీసులు ఇచ్చింది. ఈ నెల 21లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. డీజీపీ పోస్టు ఖాళీ అవడానికి మూడు నెలల ముందే యూపీఎస్సీ చైర్మన్ అధ్యక్షతన ఉండే కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సీనియారిటీ ప్రకారం పేర్లను పంపించాలి. కనీసం ఆరు నెలల సర్వీసు ఉన్న డీజీ ర్యాంకు అధికారులందరి జాబితాను పంపాలని, మెరిట్, సీనియారిటీ ఆధారంగా ముగ్గురి పేర్లను కమిటీ ఖరారు చేస్తుందని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఇందులో ఒకరిని డీజీపీగా నియమించాల్సి ఉంటుంది.

సన్నాలకు బోనస్.. కొనుగోలు బోగస్!

- సన్న ధాన్యం రైతులకు చిక్కులు
- పంట విక్రయానికి పక్కగ్రామాలకు..
- రైతులకు పాత రోజులు పునరావృతం
- ఊరికో కేంద్రమని ఊదరగొట్టి మండలానికి రెండు మాత్రమే ఏర్పాటు చేసిన సర్కారు

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): సర్కారు మాట విని సన్న ధాన్యం పండించిన రైతులకు చిక్కులు తప్పడంలేదు. బోనస్ దక్కుతుందో లేదో అనే ఆందోళన ఒకవైపు ఉంటే.. సన్నాల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై గందరగోళం నెలకొన్నది. ఊరికో కేంద్రం ఏర్పాటు చేస్తామని ఊదరగొట్టిన ప్రభుత్వం.. మండలానికి ఒకటో రెండో కేంద్రాలను ఏర్పాటు చేసి మాటమార్చింది. దీంతో సన్నాలు పండించిన రైతులు పంటను అమ్ముకునేందుకు ఇతర గ్రామాల బాట పట్టాల్సిన పరిస్థితి. ఈ సీజన్‌లో 92 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తుందని అంచనా వేసిన అధికారులు ఇందుకోసం మొత్తం 7వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ 7వేల కేంద్రాల్లోనే సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలను కలిపి ఏర్పాటు చేస్తారా? లేక అదనంగా ఏర్పాటు చేస్తారా? అనే అంశంపై సివిల్ సప్లై నుంచి స్పష్టత లేకపోవడం గమనార్హం. ఒకవేళ ఆ ఏడు వేలలోనే సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తే.. సన్న ధాన్యం రైతులకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మళ్లీ పొరుగూరికి...

మండల యూనిట్‌గా సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో ధాన్యం అమ్మకాల్లో మళ్లీ పాత రోజులు పునరావృతం అవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి ఏపీలో రైతులు తమ ధాన్యం అమ్ముకునేందుకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా రోజుల తరబడి అక్కడే ఉండి పంటను అమ్ముకొని వచ్చేవాళ్లు. ఇక వారి గ్రామం నుంచి మండల కేంద్రానికి ధాన్య